

ఇందిరమ్మ ఇళ్లను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే


ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనుల వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రకాష్‌రావులతో కలిసి కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలో చేపట్టాల్సిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ప్రతి లబ్ధిదారులు ప్రారంభించేలా మున్సిపల్, గృహ నిర్మాణ, మున్సిపల్ వార్డు అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీకి 498 ఇళ్లు మంజూరు చేశామని అన్నారు. ఇప్పటి వరకు 391 ఇళ్ల పనులు ప్రారంభించారని అన్నారు. మిగిలిన 107 మంది లబ్ధిదారులు పనులు చేపట్ట లేదని తెలిపారు. ఇందుకు గల కారణాలను తెలుసుకొని పనులు ప్రారంభించేందుకు మెప్మా కింద మహిళల సంఘాల నుంచి రుణసదుపాయం అందించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసిఫాబాద్ మున్సిపాలిటీకి 458 ఇల్లు మంజూరు కాగా ఇంకా 105 పారరంభించలేదని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందిస్తుందని, ఈ నెల 20వ తేదీలోగా పూర్తి అయిన ఇళ్లకు ప్రారంభోత్సవాలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో పని చేసి పనులు ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో మాట్లాడి త్వరగా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ డీఈ వేణుగోపాల్, మున్సిపల్ కమీషనర్లు, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

శబరిమల వెళ్లేందుకు ప్రత్యేక రైలు

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వామి దీక్షా తీసుకున్న స్వాముల కోసం శబరిమల వెళ్లేందుకు ఈ నెల 13న ప్రత్యేక రైలు కాగజ్‌నగర్ నుంచి నడుపున్నట్టు ఎమ్మెల్యే హరీష్‌బాబు మంగళవారం ఒక ప్రకటలో తెలిపారు. కాగజ్‌నగర్ నుంచి ప్రారంభమై బెల్లంపల్లి, మంచిర్యాల మీదుగా కొల్లాంకి చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక రైలు సౌకర్యం కల్పించాలని గత నెలలో రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ్‌ని కోరినట్టు తెలిపారు. ఈ మేరకు స్పందించి కాగజ్‌నగర్ నుంచి కొల్లాం వరకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు.

పంచాయతీ పోరు.. పల్లెల్లో జోరు

- గ్రామాలకు కదులుతున్న నాయకులు
- ఏకగ్రీవాలకు ప్రయత్నాలు
- పదవుల పంపకాలకు మొదలైన ఒప్పందాలు
- తమ వర్గం వారిని గెలిపించుకునేందుకు పావులు



ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు. ఇప్పటికే తొలి విడత నామినేషన్ల గడువు ముగిసింది. మంగళవారంతో రెండో విడత నామినేషన్ల గడవు ముగిసింది. దీంతో ఆయా పార్టీల నాయకులు తమ వర్గం వారిని గెలిపించుకునేందుకు వ్యూహరచన చేస్తున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలవాలి.. ఈ నానుడినే నాయకులు ఒంట పట్టించుకున్నారు. జెండా లేని పల్లె సమరంలో ఇదే అజెండాను అమలు చేయనున్నారు. ఇన్నాళ్లూ నగరాలు, పట్టణాల్లో నివాసం ఉన్న వారు పంచాయతీకి సైరన్ మోగగానే పల్లెబాట పట్టారు. 'ఊరు'లో చక్రం తిప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకు సామ ధాన బేధా దండోపాయాలను ప్రయోగిస్తున్నారు. మెజార్టీ పంచాయతీల్లో ఏకగ్రీవాలకు ప్రయత్నాలు చేస్తున్నారు. పోటీ తప్పదు అనుకున్న చోట గట్టి అభ్యర్థి కోసం వేట సాగిస్తున్నారు. అంతే కాకుండా పదవుల పంపకాలకు ఒప్పందాలు చేసుకుంటున్నారు. మొత్తానికి జెండా లేని ఎన్నికల్లో అజెండా మాత్రం కనిపిస్తోంది.

● జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో మొత్తం 335 పంచాయతీలు, 2,874 వార్డులకు ఎన్నికలు జరగబోతుండగా తొలి విడతలో జైనూరు, కెరమెరి, లింగాపూర్, సిర్పూర్ (యు), వాంకిడి మండలాలలోని 114 సర్పంచ్ స్థానాలు, 944 వార్డు స్థానాలకు, రెండో విడతలో బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల, పెంచికలపేట, సిర్పూర్(టి), దహెగాం మండలాల్లోని 113 సర్పంచ్ స్థానాలు, 992 వార్డులు, మూడో విడతలో కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లోని 108 సర్పంచ్ స్థానాలకు, 938 వార్డులకు, ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో జిల్లాలో ప్రధాన రాజకీయ పార్టీలు మెజార్టీ పంచాయతీలు గెలిపించుకునే లక్ష్యంతో కింది స్థాయి నాయకులతో మంతనాలు సాగిస్తున్నారు. జిల్లాలో పంచాయతీ తొలి విడతకు నామినేషన్ ప్రక్రియ పూర్తికాగా. మలి దశలో కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్‌లోని ఆరు మండలాలైన సిర్పూర్(టి), కౌటాల, చింతల మానేపల్లి, బెజ్జూరు, పెంచికలపేట, దహెగాం మండ లాల్లో నామినేషన్ల స్వీకరణ కూడా ప్రారంభమైంది.ఈ నేపథ్యంలో విజయమే లక్ష్యంగా జిల్లా, మండల కేంద్రాల్లోని నాయకులు గ్రామాలకు కదులుతున్నారు. ఇప్పటి వరకు సొంత ఊర్లను వదిలి వ్యాపారం, పిల్లల చదువుల కోసం ప్రధాన పార్టీల నేతలు ఎక్కువ శాతం కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పట్టణాల్లో ఇవాసం ఉంటూ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో మండల స్థాయి నాయకులతో సమన్వయం చేసుకుని ఆయా గ్రామాల్లో పార్టీల మద్దతుదారులను గెలిపించేందుకు పల్లె వైపు కదులుతున్నారు. ఎన్నికల పుణ్యమాని హైదరాబాద్, మంచిర్యాల ఇతర పట్టణాలలో ఉన్న నాయకులు స్వగ్రామాలకు వస్తున్నారు.

● మన జెండా ఎగిరితేనే..

మండల, జిల్లా, నేతలు సైతం తమ ఊరిలో మన జెండా ఎరిగితేనే పైస్థాయిలో పలుకుబడి ఉంటుందని పావులు కదుపుతున్నారు. ఇంట గెలిచి రచ్చ గెలువాలన్న భావనతో నేతలు సొంత గ్రామాల్లో పార్టీ గెలిపించాలనే తపనతో ముందు కెళ్తున్నారు. పంచాయతీ ఎన్నికల్లో గెలిస్తేనే రాజకీయాల్లో మనుగడ సాధ్యమయ్యే అవకాశాలు ఉన్న నేపథ్యంలో పంచాయతీ పోరుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పంచాయతీ ఎన్నికలు ప్రధాన పార్టీల నాయకులకు పరీక్ష కాబోతున్నాయి. ఆయా పార్టీల నాయకులు గ్రామాల్లో తమకు అనుకూలమైన సర్పంచ్ ఉండాలన్న ఎజెండాతోనే మెజార్టీ పంచాయతీలను కైవసం చేసుకొనేందుకు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

● రంగంలోకి దిగేందుకు..

మొన్నటి వరకు వామ్మో పంచాయతీ ఎన్నికలా అంత డబ్బు పెట్టలేమన్న వారు కూడా ఇప్పుడు రంగంలోకి దిగేందుకు ఉత్సాహం చూపుతున్నారు. దీంతో జిల్లాలో పంచాయతీ ఎన్నికల కోలాహలం ఊపందుకొంది. ఇప్పటికే కొన్ని చోట్ల ఏకగ్రీవాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్ని మండలాల్లో ఏకగ్రీవానికి ఒప్పుకుంటే గ్రామాభివృద్ధికి నిధులు ఇస్తామని ప్రభుత్వం నుంచి సంకేతాలు రావడంతో కొన్ని గ్రామాల్లో, తండాల్లో ఏకగ్రీవంపై తీవ్రంగా ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఏకగ్రీవం పంచా యతీలకు ప్రభుత్వం రూ.10 లక్షలు నజరానా ప్రకటించడంతో ఆ నిధులతో మరింత అభివృద్ధి సాధించవచ్చని భావిస్తున్నారు.

● సమయం తక్కువగా ఉండడంతో..

నామినేషన్ గట్టం మొదలైన నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడంతో ఎలాగైనా పంచాయతీలను చేజిక్కించుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. కొందరు కులాలను, స్నేహబంధాలను, బంధుత్వాలను ఆసరాగా చేసుకుని బరిలో ప్రత్యర్థులను తప్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మరి కొందరు డబ్బు ఆశ చూపించి రంగంలోంచి తప్పించే ప్రయత్నంలో ఉన్నారు. రిజర్వుడు పంచాయతీల్లో సర్పంచ్ పదవిని ప్రధాన పార్టీలకు వదిలి ఉప సర్పంచ్‌ని దక్కించుకొనేందుకు ద్వితీయ శ్రేణి పార్టీల నాయకులు సర్దుబాట్లు చేసుకుంటున్నారు.

కౌటాలలో తుపాకుల కలకలం

- నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ నితికా పంత్



కౌటాల పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ నితికా పంత్

కౌటాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లా కౌటాలలో ఓ వ్యాపారిని తపాకితో కాల్చి చంపేందుకు వెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేయడం కలకలం రేపింది. కౌటాల పోలీసుస్టేషన్‌లో ఎస్పీ నితికా పంత్ మంగళవారం వివరాలు వెల్లడించారు. కౌటాల మండలం కౌటి(సాండ్‌గాం)కు చెందిన కుర్బంకర్ అజయ్(31) అనే యువకుడు సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశంతో హిందీ సినిమాతో ప్రేరణ పొందాడు. బాగా డబ్బు ఉన్న వారిని బెదిరించి అవసరమైతే చంపి ఎక్కువ మొత్తంలో డబ్బులు వసూలు చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో ఈ ఏడది జూన్ 11వ తేదీన రాత్రి బెదిరిస్తూ కౌటాలకు చెందిన ఓ వ్యాపారికి లేఖలు రాశాడు. రూ. 50 లక్షలు ఇవ్వాలని, లేకుంటే నీ కుటుంబ సభ్యులను చంపుతానని రెండు లేఖలు రాసి సదరు వ్యాపారి ఎరువుల దుకాణం వద్ద పెట్టాడు. కానీ ఆ వ్యాపారి స్పందిచక పోవడంతో యూట్యూబ్‌లో చూసి పిస్టల్, తపంచా లాంటి మారణాయుధాలు బిహార్‌లో దొరుకుతాయని తెలుసుకున్నాడు. జూలై చివరి వారంలో బిహార్ వెళ్లి ఆగస్టు మొదటి వారం వరకు అక్కడే ఉన్నాడు. బాబు సాహెబ్ అనే వ్యక్తి దగ్గర రూ. 55 వేలు చెల్లించి ఒక తుపాకి, రెండు మ్యాగజిన్లు, దీనికి సంబంధిచిన 20 బుల్లెట్లు, ఒక తపంచ, దీనికి సంబంధించిన ఒక బుల్లెట్ కొనుగోలు చేసి అక్కడే షూటింగ్ నేర్చుకున్నాడు. మూడు బుల్లెట్లు అక్కడే ప్రాక్టీస్‌లో ఉపయోగించాడు. ఇంటికి చేరుకున్న అనంతరం ప్రాణహిత నది ఒడ్డున ఒక బుల్లెట్ గాలిలోకి ఫైర్ చేసి ప్రాక్టీస్ చేశాడు. సెప్టెంబరు 26న కాగజ్‌నగర్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే రైలు ఎక్కి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ తీసుకుని డబ్బులు ఇవ్వాలని మళ్లీ ఎరువుల వ్యాపారికి కుర్బంకర్ అజయ్ ఫోన్ చేశాడు. అప్పటికీ ఆ వ్యాపారి స్పందించక పోవడంతో అక్టోబరు 15వ తేదీన రాత్రి సమయంలో వ్యాపారి తమ్ముడిని చంపాలనే ఉద్దేశంతో తుపాకిలో రెండు బుల్లెట్లు నింపుకున్నాడు. వ్యాపారి తమ్ముడు ఇంటికి వెళ్లే మార్గమధ్యలో వేచి ఉన్నాడు. వ్యాపారి తమ్ముడు రాగానే అతడి ముఖంపై లైట్ ఫోకస్ పెట్టి ఒక బుల్లెట్ ఫైర్ చేశాడు. గురి తప్పడంతో అక్కడి నుంచి కుర్బంకర్ అజయ్ పారిపోయాడు. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం సదరు వ్యాపారిని ఎరువుల దుకాణంలోనే హతమార్చాలనే ఉద్దేశంతో తుపాకితో పాటు మూడు బుల్లెట్లు తీసుకుని బైక్‌పై వెళ్తుండగా మార్గమధ్యలో ఎన్నికల సందర్భంగా తనిఖీ చేస్తున్న పోలీసు లకు పట్టుబడ్డాడు. నిందితుడి నుంచి ఒక తుపాకి, ఒక తపంచా(దేశి కట్ట), రెండు మ్యాగజిన్‌లతో పాటు 15 చిన్న బుల్లెట్లు, సెల్‌ఫోన్, బైక్‌ను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వహీదుద్దీన్, కౌటాల సీఐ సంతోష్, ఎస్సై చంద్రశేఖర్, కాగజ్‌నగర్ ఎస్సై సందీప్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలో గత నెల 28, 29 తేదీల్లో పటాన్‌చెరువులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ చాటి బంగారు పతకాన్ని సాధించి విద్యార్థులను మంగళవారం కలెక్టర్ వెంకటేష్ దోత్రే .అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ఆరద్య క్రీడా పాఠశాల విద్యార్థుల క్రమ శిక్షణ, సామర్థ్యం, కఠోర శ్రమతో సాధంచిన ఈ విజయం జిల్లాకు గర్వకారణమన్నారు. భవిష్యత్‌లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీడీ రమాదేవి, ఏటీడీవో శివకృష్ణ, ఏసీఎంఓ ఉద్దవ్, జీసీడీవో శకుంతల స్పోర్ట్స్ ఆఫీసర్ షేకు, ప్రధానోపాధ్యాయుడు లింబారావు, పీడీ మీనారెడ్డి, హెచ్‌డబ్ల్యూవో సాయిబాబా, కోచ్‌లు తిరుమల్, విద్యాసాగర్, అరవింద్, రాకేష్ ఉన్నారు.

గిరి గ్రామాల అభివృద్ధిపై పట్టింపు కరువు

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గిరి గ్రామాల అభివృద్ధిపై అధికార పార్టీ పట్టింపు లేదని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. దరిగాం గ్రామంలో మంగళవారం ఆయన పర్యటించారు. రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ప్రవీణ్‌కు మార్‌తో పాటు నాయకులు కాలినడకనే గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. కనీస రోడ్డు సౌకర్యం లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మద్దతు ఇచ్చే అభ్యర్థులను తప్పకుండా ఆదరించి అధిక మెజార్టీతో గెల్పించాలని ఆయన కోరారు. దరిగాం గ్రామానికి రోడ్డు సౌకర్యం, సెల్ ఫోన్ నెట్ వర్క్ లేక బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంటున్నారని అన్నారు. ప్రభుత్వాలు మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు, బీఆర్ఎస్ నాయకులు కొంగసత్యనారాయణ, మినాజ్, తన్నీరు పోచం, మహమూద్, వాసు, బాబార్, సలీం, హన్మంతు, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



కాలినకడన దరిగాంకు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులు

ప్రణాళికతో చదవాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలోఉత్తమ ఫలితాలు సాధించాలంటే పక్కా ప్రణాళికతో చదవాలని వ్యక్తిత్వ వికాస నిపుణుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. పట్టణంలోని కేరళ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో పదో తరగతి విద్యార్థులతో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళికాబద్ధంగా చదువాలన్నారు. అప్పుడే విజయం సొంతం అవుతుందని, విద్యార్థులు పాటించాలని కోరారు. సమావేశంలో ప్రిన్సిపల్ షీజా శ్రీనివాసన్, కరస్పాండెంట్ సోని సిబ్బంది పాల్గొన్నారు.

బుజ్జగింపులు షురూ..

- నామినేషన్ ఉపసంహరించుకునేలా యత్నం
- నేటి మధ్యాహ్నం 3 గంటల వరకే గడువు

వాంకిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తొలివిడత పంచాయతీ ఎన్నికల్లో నామినేషన్లు వేసిన వారిని బుజ్జగించే పనిలో నిమగ్నమయ్యారు. ఎన్నికల బరిలో ఎవరు నిలుస్తారనేది నామినేషన్ల ఉపసంహరణ తర్వాతనే స్పష్టత రానుంది. ఒకే పార్టీకి చెందిన ఇద్దరు, ముగ్గురు మద్దతుదారులు నామినేషన్లు వేశారు. దీంతో విజయవకాశాలు తగ్గిపోయే ప్రమాదం ఉన్న నే పథ్యంలో బుజ్జగింపుల పర్వం ఊపందుకుంది. ఇందుకు రహస్య సమావేశాలు నిర్వహిస్తూ అవసరమైన హామిలను ఇస్తూ ఉపసంహరణ చేసుకునేలా పెద్ద మనుషులు, కులపెద్దలతో చెప్పిస్తున్నారు. అలాగే పలుచోట్ల భారీగా డబ్బులు ముట్టజెప్పి పోటీ నుంచి తప్పించే ప్రయత్నాలు సైతం చేస్తున్నారు. సర్పంచ్ పదవులకు భారీ నామినేషన్లు దాఖలు కావడంతో తమ ప్రత్యర్థులను బరిలో నుంచి తప్పించేందుకుఅభ్యర్థులు ఎవరి ప్రయత్నాల్లో మునిగి తేలారు. ఉపసంహరణకు బుధవారం (3వ తేదీ) మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే అవకాశం ఉంది. దీంతో ప్రత్యర్థులను బరిలో నుంచితప్పించే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. పంచాయతీ ఎన్నికల్లో ఒక్కో ఓటు ఎంతో కీలకం కానున్న క్రమంలో తమ ప్రత్యర్థులను పెద్దమనుషులతో, పార్టీల ముఖ్య నాయకులతో బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. కానీ నామినేషన్ దాఖలు చేసిన వారిలో ఉపసంహరించేందుకు ఎవరూ వెనక్కితగ్గడంలేదు. ఎంత ఖర్చు అయినా పోటీలో ఉండడమే లక్ష్యంగా ఉన్నారు. ఒక ఓటు అభ్యర్థుల విజయావకాశాలు తారుమారు చేసే అవకాశం ఉండడంతో మద్దతుదారుల ఓట్లు చీలిపోకుండా తమ నామినేషన్లను ఉపసంహరించుకునేలా పావులు కదుపుతున్నారు. పంచాయతీ ఎన్నికలతో గ్రామాల్లో రాజకీయం రసవత్తరంగా మారాయి. సర్పంచ్, వార్డు పదవులకు ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థులు ప్రచారం ప్రారంభించారు. నామినేషన్ల ఉపసంహరణ సర్వం ముగియక ముందే గుత్తులు కేటటాయింపు జరగకున్నా ప్రచారం మొదలు పెట్టారు. ఓటర్లను కలుస్తూ తమదైన శైలిలో ముం దుకు సాగుతూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఈ సారి తమకే ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ఒక్క చాన్స్ ఇవ్వాలంటూ వేడు కుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుస్తూ...రాత్రి వేళ తమ మద్దతుదారులతో సమావేశమై ప్రత్యర్థులకు దీటుగా వ్యూహరచన చేస్తున్నారు. గ్రామాల్లో సామాజిక వర్గాల వారీగా బలాబలాలను అంచనా వేసుకుం టూ తమకు అనుకూలంగా ఉండే ఓటర్లపై దృష్టి సారిస్తున్నారు. గతంలో సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులుగా పనిచేసిన వారికి ఈ సారి రిజర్వేషన్లు అనుకూలంగా రాకపోవడంతో సర్పంచ్ పదవికి పోటీ పడుతున్నారు. తమను గెలిపిస్తే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇస్తున్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ హైరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రోల్ ప్లే పోటీలలో ఆసిఫాబాద్ కేజీబీవీ విద్యార్థులు పాల్గొని ప్రశంసాపత్రాలు పొందారు. పాఠశాలకు చెందిన విద్యార్థినులు శ్రావ్య, హరిణి, వెన్నెల, ప్రియాంక, అలేఖ్య, గంగ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఈఓ దీపక్ తివారి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి శ్రీనివాస్‌ను అభినందించారు.

అధికారులు ఏర్పాట్లు చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల గవర్నర్‌గా సేవలు అందించిన కొణిజేటి రోశయ్య వర్ధంతిని గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

వరి కొయ్యలను కాల్చొద్దు

దహెగాం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వరి కోతల తరువాత కొయ్యలను కాల్చితే భూసారం దెబ్బతింటుందని ఏవో రామకృష్ణ అన్నారు. మండలంలోని గిరివెల్లి, ఖర్జి గ్రామంలోని రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. వరి కొయ్యలను కాల్చితే నేలలోని సేంద్రియ పదార్థాలు నశిస్తాయని సూచించారు.

బీజేపీలో చేరికలు

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజురా గ్రామానికి చెం దిన పలువురు మంగళవారం బీజేపీ చేరారు. వారికి బీజేపీ సీనియర్ నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రధాని నరేంద్ర మోదీ చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మల్లికార్జున్, రాజేంద్రప్రసాద్, అనురాగ్, దీపక్ రావ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురు

తిర్యాణి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలం కైరిగూడ, మాణిక్యాపూర్, లక్ష్మీపూర్‌కు చెందిన వంద మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు మంగళవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి ఆ పార్టీ మండలాధ్యక్షుడు జగదీష్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచే అభ్యర్థుల గెలుపునకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాజయ్య, మల్లేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూడో విడత నామినేషన్లు

కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మూడో విడత నిర్వహించే ఎన్నికలకు కాగజ్‌నగర్ మండలంలో బుధవారం నుంచి నామినేషన్లు స్వీకరించేదుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 28 గ్రామ పంచాయతీలు ఉండగా, భట్టుపల్లి, అందవెల్లి, బోడెపల్లి, జగన్నాథ్‌పూర్ జీపీలకు భట్టుపల్లి జడ్పీ పాఠశాలలో నామినేషన్ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే వంజీరి, బారెగూడ, అంకుసాపూర్ జీపీలకు వంజీరి గ్రామ పంచాయతీలో, చింతగూడ, ఈసుగాం, కోయవాగు జీపీలకు చింతగూడ గ్రామ పంచాయతీలో, నజ్రూల్‌నగర్, బసంతీనగర్, రాంనగర్, దుర్గానగర్ జీపీలకు నజ్రూల్‌నగర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో, నాగంపేట, వల్లకొండ, రాస్పెల్లి, కొత్తసార్సాల జీపీలకు నాగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మోసం కడంబా, గన్నారం, అనుకోడ జీపీలకు నాగంపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో, మోసం, కడంబా, గన్నారం, అనుకోడ గ్రామ పంచాయతీలకు మోసం గ్రామపంచాయతీ కార్యాలయంలో, కోసిని, బురుదగూడ, ఎస్టీవోఎస్ కాలనీ, రేగులగూడ జీపీలకు కోసిని ప్రభుత్వ పాఠశాలలో, మాలిని, లైన్‌గూడ జీపీలకు మాలిని గ్రామ పంచాయతీ కార్యాలయంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు స్వీకరణ ప్రక్రియ నిర్వహించేందుకు అన్నీ చర్యలు తీసుకుంటున్నారు. అలాగే ఈ నెల 6న స్రూనిటి, 7న అప్పీల్, 8న బరిలో ఉండే అభ్యర్థుల జాబితా విడుదల, 9న విత్‌డ్రా, 9న బరిలో ఉండే అభ్యర్థుల తుది జాబితా విడుదల చేయనున్నారు. 17న ఎన్నికలు నిర్వహించనున్నారు.

కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐహెచ్‌ఎఫ్‌ఎంఎస ప్రకారం ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్ పేషంట్ కేర్, సెక్యూరిటీ కాంట్రాక్టు వ్యవరథ రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేసి గ్రీన్ చానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆసుపత్రికి ఎదుట ధర్నా నిర్వహించారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఈపీఎఫ్ డబ్బులు ఇవ్వాలని, ఈఎస్‌ఐ గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పెండింగ్ సమసయలు పరిష్కరించాలని కోరారు. లేని పక్షంలో ఈ నెల 5న డీఎంఈ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు ఉపేందర్, దివాకర్, శంకర్, నగేష్, మాదవి, గంగన్న, నీల, కమల, కృప, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.



నిరసన తెలియజేస్తున్న కార్మికులు, ఏఐటీయూసీ నాయకులు

పంచాయతీలకు నిధులు ఎలా వస్తాయంటే..



ఖర్చులు ఇలా..

గ్రామపంచాయతీ ఖర్చులను మూడు రకాలుగా పరిశీలించవచ్చు. కార్యాలయ నిర్వహణ, పాలనా వ్యయాలు, రోడ్లు, డ్రైయినేజీ, వీధిదీపాలు, పచ్చదనం నిర్వహణకు, సామాజిక కార్యక్రమాలకు నిధులు వ్యయం చేస్తారు. ప్రజలు కేంద్ర ప్రభుత్వ ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ ద్వారా పంచాయతీకి కేటాయించిన బడ్జెట్, ఖర్చుల వివరాలు, ఆడిట్ నివేదికను సులభంగా పరిశీలించవచ్చు. ఇది గ్రామాభివృద్ధిలో జవాబుదారీతనాన్ని పెంచుతుంది.

- పల్లెలకు మూడు రకాలుగా ఆదాయం
- సొంత వనరులతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు
- ఆ నిధులతోనే మౌలిక వసతుల కల్పన

బెజ్జూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల అనంతరం స్థానిక ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడం, గ్రామాల్లో ఎన్నికల సందడి మొదలుకాగా ఇప్పటికే మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తి కాగా రెండో విడత నామినేషన్ల పర్వం కూడా మంగళవారంతో ముగిసింది. ఇక పాలకవర్గాలు కొలువు దీరడమే తరువాయి. అయితే గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు నిధులు అవసరం.

ఇందుకోసం గ్రామ పంచాయతీలకు ప్రధానంగా సొంత వనరులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్ల నిధులు వస్తాయి. పంచాయతీలకు ఎలాంటి నిధులు ఎక్కడి నుంచి ఎలా వస్తాయి, గ్రామాల్లో ఎలాంటి అభివృద్ధి కార్య క్రమాలు చేపడతారో తెలుసుకుందాం

పన్నుల ద్వారా..

పంచాయతీలు విధించే పన్నులు, రుసుముల ద్వారా ఆదాయం సమకూరుతుంది. గృహపన్ను, నీటి పన్ను, వృత్తి(వ్యాపారాలు, వృత్తులపై) పన్ను, వారాంతపు సంతలు, మార్కెట్ల నిర్వహణ ద్వారా, పంచాయతీకి చెందిన భవనాలు, ఖాళీ స్థలాల వంటి ఆస్తులు అద్దెకు ఇవ్వడం ద్వారా పంచాయతీకి సొంత వనరులు సమకూరుతాయి. రాష్ట్ర ప్రభుత్వం స్టాంపు డ్యూటీ వాటా చెల్లిస్తుంది.

భూముల కొనుగోలు, రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వానికి వచ్చే స్టాంపు డ్యూటీలో కొంత వాటా ను పంచాయతీలకు అందిస్తుంది. రాష్ట్ర ఆర్థిక సం ఘం సిఫార్సుల మేరకు అభివృద్ధి, నిర్వహణ ఖర్చుల కోసం ప్రభుత్వ సాధారణ గ్రాంట్లు విడుదలవుతాయి. ప్రత్యేక అవసరాల కోసం ముఖ్యమంత్రి హామీల అమలుకు, ఇతర కార్యక్రమాలకు రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుంది.

కేంద్ర ప్రభుత్వం నుంచి..

ఐదేళ్లకోసారి కేంద్ర ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు నేరుగా గ్రామపంచాయతీ ఖాతాల్లోకి కేంద్ర ఆర్థిక సంఘం గ్రాంట్లు బదిలీ అవుతాయి. పారిశుద్యం, మౌలిక వసతుల కల్పనకు ఉపయోగపడతాయి. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులకు, కూలీల వేతనాలకు నిధులు అందుతాయి. స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా గ్రామ పారిశుధ్యం, ఘన వ్యర్థాల నిర్వహణకు నిధులు కేటాయిస్తారు. ప్రధాన మంత్రి గ్రామ సడక్‌యోజన వంటి పథకాలతో ప్రాంతాల అభివృద్ధికి, రోడ్ల నిర్మాణాలకు నిధులు మంజూరవుతాయి. కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రారంభించిన జల్ జీవన్ మిషన్ ద్వారా శుద్ధమైన తాగునీటి సరఫరాకు నిధులు విడుదల చేస్తోంది.

వ్యూహప్రతివ్యూహాలకు పదును

సిర్పూర్ నియోజకవర్గంలో పట్టుకోసం నేతల మంతనాలు



కాగజ్‌నగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్ నియోజకవర్గంలో పంచాయతీ ఎన్నికల్లో పట్టు కోసం నేతలు వ్యూహప్రతి వ్యూహాలకు పదును పెండుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు ప్రకటించిన నేపథ్యంలో పల్లెల్లో ఎన్నికల సం దడి ఏర్పడింది. ఒక వైపు పత్తి ఏరివేత పనుల్లో రైతులు ఉదయం పూట బీజీ బీజీగా ఉండటంతో వీరిని కలుసుకునేందుకు ప్రధాన పార్టీల నాయకులంతా కూడా రాత్రి వేళల్లో గ్రామాల్లోకి మకాం మార్చేస్తున్నారు. సభ లు, సమావేశాలు పెడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రిజర్వేషన్ ప్రక్రియకు అనుగుణంగా అభ్యర్థుల కోసం గాలం వేస్తున్నారు. ప్రస్తుతం అన్ని పార్టీల్లో పోటీ ఉండగా, ఏ అభ్యర్థికి మద్దతు ఇస్తే గెలిచే అవకాశాలపై గ్రామాల్లోనే చర్చిస్తున్నారు. ప్రస్తుతం సిర్పూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆధ్వర్యంలో పూర్తిగా పర్యవేక్షిస్తున్నారు. సిర్పూరు నియోజకవర్గంలో అన్నీ గ్రామాలపై తమ పట్టుపెంచేశారు. వీటితో పాటు గెలుపు గుర్రాలపై పక్కాగా స్కెచ్ వేసి ముందుకెళ్లుతున్నారు. గత మూడు రోజులుగా కౌటా ల, బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల్లో రేయింబవళ్లు తిరుగుతు పార్టీ శ్రేణులకు ఉత్సాహం నింపుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ తరుపున బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తన అనుచరగణంతో కాగజ్‌నగర్ మండలం అనుకోడ, అందవెల్లి, ఈసుగాం క్యాంపుల్లో రాత్రి వేళల్లో సభలు నిర్వహిస్తున్నారు. స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకుంటున్నారు. అలాగే బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిపై కూడా ప్రజల్లోకి ముమ్మరంగా తీసుకెళ్లుతున్నారు. పార్టీ బలోపేతానికి క్షేత్ర స్థాయి కార్యకర్తలకు భరోసా కల్పిస్తూ గ్రామాల్లో నేరుగా తిరుగుతున్నారు. ఇదే పార్టీ నుంచి సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కూడా పార్టీ క్యా డర్ పెంచే దిశ గా పకడ్బందీగా అడుగులు వేస్తున్నారు. ఇతర పా ర్టీల నుంచి వచ్చిన నాయకుల ను, కార్యకర్తలను పార్టీలోకి చేర్పిస్తున్నారు. ఇక సిట్టింగ్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు పల్లెల్లో ఈ సారి బీజేపీతో బోణి కొట్టేలా చర్యలు తీసుకుంటున్నారు. పార్టీ క్యాడర్, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి వెళ్లేట్టు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. బీజేపీ పార్టీతో పాటు తన తండ్రి మాజీ ఎమ్మె ల్యే పాల్వాయి పురుషోత్తంరావు వ్యక్తిగత ఇమేజ్‌తో స్థానిక సంస్థల్లో అడుగులు వేస్తున్నారు. ఈ పాటికే పార్టీ క్రియాశీలక సమావేశాు నిర్వహిస్తున్నారు. మండలాల వారీగా బాధ్యతలను అప్పజెప్పుతున్నారు.

కాగాస్థానిక సంస్థల ఎన్నికల సమీపిస్తుండటంతో జంప్ జిలానీలు పెరిగి పోతున్నారు. ఏప్పుడే ఏ పార్టీలో ఉంటున్నారోతెలియక అంతా హైరాన పడుతున్నారు. నిన్నటి వరకు ఒక పార్టీలో ఉంటూ రాత్రికి రాత్రే పార్టీ మారుతున్నారు. బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లోకి, బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి, కాంగ్రెస్ నుంచి బీజేపీలోకి కార్యకర్తలు, నాయకులు మారుతున్నారు. సర్పంచ్ ఎన్నికలకు పార్టీలతో సంబంధం లేకుండా నిర్వహిస్తారు. అభ్యర్థి మద్దతు కోసం పార్టీ నాయకులను సంప్రదించి ఆశీస్సులు తీసుకుంటున్నారు.

ఏరియాలో 58 శాతం బొగ్గు ఉత్పత్తి

శ్రీరాంపూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్ ఏరియాలో నవంబరులో 58 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నవంబరు నెలలో 5 లక్షల 88 వేల 800 టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాల్సి ఉండగా, 3 లక్షల 43 వేల 410 టన్నులు వెలికి తీసినట్లు చెప్పారు. ఆర్‌కే న్యూటెక్ 113 శాతంతో ముందంజలో ఉందన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను 75 శాతం క్వాలిటీతో సింగరేణి సంస్థలో శ్రీరాంపూర్ ఏరియా మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఇందుకుగాను సీఎండీ ఎన్. బలరాం చేతులమీదుగా షీల్డ్‌ను స్వీకరించామన్నారు. ఆర్‌కే న్యూటెక్ గని, ఆర్‌కే 6 గని 5 స్టార్ రేటింగ్ ఇన్‌స్పెక్షన్ పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఉపరితల గనిలో 5 కోట్ల 26 లక్షల రూపాయల విలువ గల 75 టన్నుల హైడ్రాలిక్ క్రేన్‌ను ప్రారంభించామన్నారు. వర్క్ పీపుల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సింగరేణివ్యాప్తంగా ప్రతిభ చూపిన క్రీడాకారులకు కబడ్డీ శిక్షణ శిబిరంను శ్రీరాంపూర్‌లోని ప్రగతి మైదానంలో ప్రారంభించామన్నారు. 150 మస్టర్లు చేయని ఉద్యోగులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తూ విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని సూచించడం జరిగిందన్నారు. 4333 మంది ఉద్యోగులకు మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ జరుగగా, ఇప్పటి వరకు 3791 మందికి కారుణ్య నియామక విధానంలో ఉద్యోగాలు ఇచ్చామని, 275 మందికి 25 లక్షల రూపాయల చొప్పున డబ్బులు అందించామన్నారు. 20 మందికి ఎంఎంసీ ద్వారా నెలకు 39 వేల 69 రూపాయల చొప్పున పంపిణీ చేయడం జరిగిందన్నారు. సమిష్టి కృషితో కలిసికట్టుగా శ్రీరాంపూర్ ఏరియాకు నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని, కంపెనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన ఉద్యోగులను ఆదేశించారు. ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని చెప్పారు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి పాటుపడాలని కోరారు.

ఏరియా అభివృద్ధికే ప్రజాభిప్రాయ సేకరణ

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా అభివృద్ధి కోసమే ఆర్కే ఓసీపీ విస్తరణలో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేపడుతున్నామని మందమర్రి జీఎం రాధాకృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణను బుధవారం రామకృష్ణపూర్‌లోని డాట్ కంపెనీ వద్దనిర్వహి స్తున్నామన్నారు. ఇప్పటికే ఈ ప్రజాభిప్రాయ సేకరణకు ఏర్పాట్లు పూర్తయ్యాయన్నారు. ఓసీపీ విస్తరణ ద్వారా మరో రెండు దశాబ్దాలు బొగ్గు నిల్వలు ఉంటాయన్నారు. విస్తరించే ప్రాంతాలను పరిశీలించామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు కూడా పెద్దపీట వేస్తామని, ఓసీ విస్తరణలో ప్రభావిత ప్రాంతాలు ఏమిలేవని తెలిపారు. ఓసీపీ విస్తరణలో భాగంగా మందమర్రికి కొంత ఊరట ఉంటుందన్నారు


మాట్లాడుతున్న జీఎం రాధాకృష్ణ

నేడు ప్రజాభిప్రాయ సేకరణ

రామకృష్ణాపూర్, (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ మెగా ఓసీపీ ఫేజ్2 ప్రజాభిప్రాయ సేకరణ బుధవారం చేపట్టనున్నారు. కాలనీ వాసులను, స్థానిక, కార్మిక, కులసంఘాల ప్రజాప్రతినిధులను కలుపుకొని రామకృష్ణాపూర్ భవిష్యత్ ఓసీపీతో 18 సంవత్సరాలు మరింత మెరుగుపడనుందని, రోడ్డు, రవాణా, సెంట్రల్ లైటింగ్, కార్మిక కాలనీ అభివృద్ధి తదితర అంశాలను చర్చిస్తు ఆర్కే4 గడ్డ ప్రాంత వాసులకు సంస్థ ఆధ్వర్యంలో స్పష్టమైన హామీ ఇవ్వనున్నట్లు జీఎం తెలిపారు. ఈ సందర్భంగా ఓసీపీ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండ పోలీసు బందోబస్తు నిర్వహిస్తున్నట్లు బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ తెలిపారు. ఆయన వెంట సీఐ శశిధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

ప్రమాదవశాత్తు ట్రాక్టర్ డ్రైవర్ మృతి

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం ఎక్స్‌రోడ్డు సమీపంలోని మామిడి తోటలో ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ జిల్లా తుని మండలంలోని కే సీతయ్యపేటకు చెందిన పెదకాపు దరకొండ (58) అనే ట్రాక్టర్ డ్రైవర్ మృతిచెందాడు. దరాకొండ మామిడి చెట్లు కటింగ్ చేయడానికి చెన్నూరు మండలంలోని అంగ్రాజ్‌పల్లికి వచ్చి నివాసం ఉంటున్నాడు. అతని పనిలో భాగంగా గంగారం ఎక్స్ రోడ్డు సమీపంలో ఉన్న మామిడి తోటలో చెట్లను కటింగ్ చేశాడు. కటింగ్ చేసిన ముక్కలను ట్రాక్టర్ ట్రాలీలో లోడ్ చేసేందుకు ట్రాలీని లిఫ్ట్‌తో పైకి లేపగా అది మధ్యలోనే జామ్ అయింది. లిఫ్ట్‌కు మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా ట్రాలీ వచ్చి దరకొండపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

ఎల్లారం అడవిలో పెద్దపులి సంచారం


అధికారులు గుర్తించిన పెద్దపులి పాదముద్ర

నెన్నెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుశ్నపల్లి రేంజీ పరిధిలోని ఎల్లారం అడవిలో పెద్దపులి సంచరిస్తోంది. నీలగిరి ప్లాంటేషన్‌లో పెద్దపులి అడుగు జాడల(పగ్‌మార్క్స్)ను మంగళవారం ఫారెస్టు అధికారులు గుర్తించారు. పెద్దపులి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు కుశ్నపల్లి రేంజీ అధికారి దయాకర్ తెలిపారు. నెన్నెల మండలంలోని చిత్తాపూర్, బొప్పారం, కొత్తూరు అడవుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పశువుల కాపర్లు అటువైపుగా వెల్లకూడదని, పొలాలు, పత్తి చేలకు వెల్లే రైతులు, కూలీలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జన్నారం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కవ్వాల్‌టైగర్‌జోన్‌లోని జన్నారం అటవిడివిజన్‌లో గల ఇందన్‌పల్లి రేంజ్‌లో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని రేంజ్‌కు తరలించినట్లు ఎఫ్ఆర్‌వో లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక తరలిస్తున్నారనే పక్కాసమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నామన్నారు. అటవి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా చేసినా, కలప అక్రమంగా తరలించినా, వన్యప్రాణులను వేటాడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో రవి, ఎఫ్‌బీవో తస్నీనర్ పాల్గొన్నారు.

కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటాలి


మాట్లాడుతున్న ఎస్ఓటు జీఎం లలితా ప్రసాద్

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోల్ ఇండియా పోటీల్లో సత్తా చాటి సింగరేణి కీర్తిపతకాన్ని ఎగురవేయాలని పతకాలు సాధించే క్రీడాకారులకు సింగరేణి యాజమాన్యం చేయతనందిస్తున్నందని లలిత ప్రసాద్ తెలిపారు. మందమర్రి ఏరియా ఉద్యోగుల అథ్లెటిక్స్ వార్షిక క్రీడలకు మంగళవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన ఉద్యోగులను ఉద్దేశించి మాట్లాడారు. ఇటీవల కొత్తగూడెంలో జరిగినటువంటి కోల్ ఇండియా కబడ్డీ పోటీల్లో సింగరేణి జట్టు 2వ బహుమతి సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. ఏటా తప్పకుండా కోలిండియా ప్రథమ బహుమతి సాధించే విధంగా ఇప్పటి నుంచి సాధన చేయాలన్నారు. ఎంచుకునే క్రీడల్లో రాణించి పతకాలు సాధించే వారికి యాజమాన్యం అండగా ఉంటుందని తెలిపారు. క్రీడలకు సింగరేణి సీఎండీ బల్‌రాం పెద్దపీట వేస్తున్నారన్నారు. ఈ సంద ర్భంగా ఆయన జెండా ఊపి అథ్లెటిక్ పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి బీమనాథుని సుదర్శన్, క్రీడల కార్యదర్శి మాస్కుల కార్తీక్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ శివక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి సాగు చేస్తున్న ముగ్గురిపై కేసు

వాంకిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామ శివారులో పత్తి చేనులో గంజాయి సాగి చేసి విక్రయిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు. జైత్‌పూర్ గ్రామానికి చెందిన బోర్కుటే సుభాష్, గుర్నులె సురేష్, ఆత్రం భీములు చేనులలో గంజాయి సాగు చేస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 16 గంజాయి మొక్కలు, 2.6 కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.2,25,000 ఉంటుందని తెలిపారు. గంజాయి సాగు చేసనా, వినియోగించినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గంజాయి వినియోగించకుండా తనిఖీలు చేపడుతున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు.

వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాలి


రికార్డులు తనిఖీ చేస్తున్న ఎస్పీ నితికా పంత్

సిర్పూర్(టి), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికల్లో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసిన చెక్ పోస్టులో అప్రమత్తంగా ఉండి ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా ఎస్పీ నితికా పంత్ అన్నారు. సిర్పూర్(టి) మండలం సరిహద్దులోని వెంకట్రావుపేట-పోడ్సా వద్ద ఏర్పాటు చేసిన ఎన్నికల చెక్ పోస్టును మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాల రాక పోకల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల్లో భాగంగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, గడ్చిరోలి నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించాని ఎస్పీ ఆదేశించారు. మద్యం, డబ్బులు, ఇతర ప్రలోబాలకు గురి చేసే వస్తువులు రవాణా చేస్తే ఎంతటి వారైనా వదిలి పెట్టేది లేదని హెచ్చరించారు. అట్టి వాహనాలను సీజ్ చేసి సమాచారం అందించాలని చెప్పారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నిబంధనలు పాటించాలని సూచించారు. ఆమె వెంట డీఎస్పీ వహీదుద్దీన్, సీఐ సురేష్, చెక్ పోస్టు సిబ్బంది ఇమ్రాన్‌ఖాన్ తదితరులు ఉన్నారు

ఆసిఫాబాద్, (ఆంధ్రజ్యోతి): ఓటీపీ, యూపీఐ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ నితికా పంత్ అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం సైబర్ సారథి పేరుతో ప్రత్యేక అవగాహన డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైబర్ నేరాల నివారణకు ' ఫ్రాడ్ కా ఫుల్ స్టాఫ్' ప్రచార కార్యక్రమం మంగళవారం డీజీపీ శివధర్‌రెడ్డి వర్చువల్‌గా ప్రారంభించారని చెప్పారు. ఈ అనంతరం కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ చిత్తరంజన్, సీఐలు రవీందర్, బాలాజీ వరప్రసాద్, తేజస్విని, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విషాహారం తిని మూడు మేకలు మృతి


మృతి చెందిన మేకలు

వాంకిడి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వాంకిడి మండల కేంద్రంలో మంగళవారం విషాహారం తిని మూడు మేకలు చనిపోగా మరో 20 మేకలు అస్వస్థతకు గురయ్యాయి. మండల కేంద్రానికి చెందిన తిరుపతి అనే మేకల కాపరి బుధవారం మేకల మందను మేపేందుకు వార సంత ప్రాంతానికి తీసుకువెళ్లాడు. అక్కడ గుర్తు తెలియని వ్యక్తులు అన్నంలో విషం కలిపి పెట్టారు. మందలోని కొన్ని మేకలు విషాహారాన్ని తినడంతో అస్వస్థతకు గురయ్యాయి. అస్వస్థతకు గురైన మేకలను స్థానిక పశువైద్య శాలకు చికిత్స నిమిత్తం తరలించారు. పశువైద్య శాలలో మందులు అందుబాటులో లేని కారణంగా సకాలంలో మేకలకు వైద్యం అందలేదని యజ మానులు వాపోయారు. మందులు బయటి నుంచి కొనుగోలు చేసి తీసుకువచ్చిన తర్వాత మేకలకు పశువైద్య సిబ్బంది చికిత్సలు చేశారని యజమానులు చెబుతున్నారు. అస్వస్థతకు గురైనా వాటిలో మూడు మేకలు చనిపోగా మరో 20 మేకల పరిస్థితి ఆందోళన కరంగా ఉందని తెలిపారు.

కొనుగోలు కేంద్రం ప్రారంభం

పెంచికలపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్కపల్లి గ్రామంలో మంగళవారం ఐకేపీ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో రామకృష్ణ, ఏపీఎం అశోక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో వంశీ, సిబ్బంది ఉన్నారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 21న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎంవీ రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని కోర్టు కార్యాలయంలో సీనియర్ సివిల్ జడ్జి యువరాజ, జూనియర్ సివిల్ జడ్జి అనంతలక్షిమలతో కలిసి పోలీసులు, అటవీ, ఎక్సైజ్ అధికారులతో పాటు బార్ అసోసియేషన్ సభ్యులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ రాజీ కేసులు వచ్చేలా చూడాలన్నారు. జాతీయ లోక్ అదాలతలో క్రిమినల్, సివిల్, ప్రీ లిటిగేషన్, బ్యాంకు, ఎలక్ట్రిక్ సిటీ, భూతగాదాలు, వివాహ తగాదాలు, మోటారు వెహికల యాక్సిండెంట్, చిట్ ఫండ్, చెక్ బౌన్స్ కేసులు, ఇతర రాజీపడదగు కేసులు పరిష్కరించాలని అన్నారు. కక్షిదారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో పోలీసు, అటవీ అధికారులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి


కోత్మీర్‌లో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

దహెగాం/పెంచికలపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. దహెగాం మండలంలోని కోత్మీర, దహెగాం, పెంచికలపేట మండలంలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను మంగళవారం సందర్శించారు. నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, నామినేషన్ పరిశీలన, పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, ఫొటో ఓటర్ స్లిప్పుల పంపిణీ, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్, పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లు, ఓటింగ్ నిర్వహణ ప్రక్రియ, ఫలితాలు వంటి అంశాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్ణీత గడువు దాటిన తరువాత వచ్చే నామినేషన్లను తీసుకోకూడదన్నారు. దహెగాంలో సామగ్రి పంపిణీ కేంద్రాన్ని తనిఖీ చేసి సూచనలు చేశారు. అనంతరం దహెగాం మండలంలోని బీబ్రా, పెంచికలపేట మండలంలోని దరోగపల్లి ప్రభుత్వ పాఠశాలలను సంద ర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనం అమలు తీరు, తదితరాలను పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలన సూచించారు. ఆయన వెంట తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు ఉన్నారు.

ఉపాధ్యాయుడికి డాక్టరేట్ పట్టా

కోటపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవులవాడ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు పడిదం శ్రీనివాస్‌కు జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ పట్టాను అందించింది. డాక్టర్ ఎన్‌వీఎస్ఎన్ లక్ష్మీ పర్యవేక్షణలో ఈ ఉపాధ్యాయుడు గ్రామీణ విద్యార్థులకు ఆంగ్ల భాషపై పట్టు సాధించే దిశగా ఆంగ్లభాషలోని వ్యాకరణాన్ని రాసే విధానంపై డాక్టరేట్ పొందాడు. ప్రాథమిక స్థాయి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసి ఉన్నత ఉద్యోగం సంపాదించిన శ్రీనివాస్ డాక్టరేట్ పట్టా పొందడం పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేసి అభినందించారు.

లోకో పైలెట్ల సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం బెల్లంపల్లి రైల్వే స్టేషన్ ఆవరణలో లోకో రన్నింగ్ ఉద్యోగులు నిరహార దీక్ష చేపట్టారు. పలువురు మాట్లాడుతూ పని గంటలు తగ్గించాలని వారాంతపు విశ్రాంతిని ఇవ్వాలని కోరుతూ అధికారులకు విన్నవించుకుంటున్న పట్టించుకోవడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం దీక్ష చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

శాంతిఖని గని సందర్శన


బెల్లంపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): శాంతిఖనిగనిని ఏఐటీయూసీ నాయకులు మంగళవారం సందర్శించారు. కొన్ని రోజులుగా బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయిందని అందుకు సంబంధించిన కారణాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే మైన్ యొక్క సేఫ్టీ, ప్రొడక్షన్ గురించి తెలుసుకున్నారు. శాంతి ఖనిగనిని త్వరితగతిన ప్రారంభించాలని పేర్కొన్నారు. ఏఐటీయుసీ బ్రాంచి సెక్రటరీ దాగాం మల్లేశ్, ఫిట్ సెక్రటరీ తిరుపతి గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

లక్షెట్టిపేట, డిసెంబర్2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం ముత్తె బుచ్చయ్య పల్లె గ్రామ శివారులో మంగళవారం హార్వెస్టర్ ఢీకొని ఒకరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి.

బలరావుపేటకు చెందిన దుర్గం మల్లయ్య, మధూకర్ మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హార్వెస్టర్ ఢీకొనడంతో మల్లయ్య (45) మృతి చెందగా మధూకర్‌కు గాయాలు కావడంతో స్థానికులు మంచిర్యాల ఆసుపత్రికి తరలిం చారు.

అన్నా..యాదుందా





ఓట్ల పండుగకు రావాలె..

- వలస ఓటర్లకు ఆశావహుల పిలుపు
- సిటీల్లో ఉండే యూత్‌పై ఫోకస్

నెన్నెల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి కోసం పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లిన వారు, ఉన్నత చదువుల కోసం సీ టీల్లో ఉంటున్న స్టూడెంట్లు దసరా, దీపావళి, సంక్రాంతి లాంటి పండుగలకు మాత్రమే గ్రామాలకు వస్తారు. వాటి సరసన మరో కొత్త పండుగ చేరింది. అదే ఓట్ల పండుగ.. ఒక్క ఓటు కూడా ఎ న్నికల ఫలితాలను తారుమారు చేసే అవకాశం ఉండడంతో దూర ప్రాంతాల్లో ఉన్న ఏ ఒక్క ఓటు కూడా మిస్ కావద్దనే ఉద్దేశ్యంతో పోలింగ్ రోజున స్వగ్రామాలకు రప్పించుకునే ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అవసరమైతే ప్రయాణ ఖర్చులు తామే భరిస్తామని ఓటరు మహాశయులను ప్రసన్నం చేసుకుంటున్నారు.

ఒక్క ఓటు తప్పొద్దు..

పల్లెపోరులో ప్రతీ ఒక్క ఓటు కీలకమే. అతి తక్కువ ఓట్లతోనే గెలుపోటములు ఉంటాయి. ఏ కొన్ని ఓట్లు మిస్సయినా భవిత వ్యం మారుతుందని నాయకులు భావిస్తున్నారు. ఓటరు లిస్టు దగ్గర పెట్టుకొని ఒక్కొక్క ఓటును లెక్కేసుకుంటున్నారు. తమకు తెలిసిన వారి ఓట్లన్నీ పోలయ్యేలా, అవి తమకే పడేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఏ ఒక్కరినీ వదలకుండా వారిని ప్రసన్నం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

ఇందులో భాగంగా పల్లెల నుంచి పట్టణాలకు, నగరాలకు వలస వెళ్లిన వారితో పాటు ఉన్నత చదువుల కోసం సీటీల్లో ఉంటున్న స్టూడెంట్స్, ఇతర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న స్థానికులపై ప్రత్యేక దృష్టి సారించారు. వారి ఓట్లను తమవైపు తిప్పుకునేలా ప్లాన్ చేసుకుంటున్నారు. దూర ప్రాంతాల నుంచి వారిని రప్పించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

ప్రత్యేక టీమ్‌లు

గ్రామాల నుంచి వేలాది మంది పట్టణాలు, నగరాలకు వలస వెళ్లిన వారున్నారు. ఉపాధి కోసం హైదరాబాదుతో పాటు ఇతర రాష్ట్రాలకు వెళ్లిన దినసరి కూలీలు, కార్మికులు, ఓటు హక్కున్న స్టూడెంట్స్, ఉద్యోగులపై నాయకులు దృష్టి కేంద్రీకరించారు. వారు ఇతర ప్రాంతాల్లో ఎక్కడున్నా పర్వా లేదు.. వారిని ఎన్నికల కోసం తీసుకురావాలని భావిస్తున్నారు. వారి అడ్రస్‌లు తెలుసుకునే పనిలో ప్రత్యేక టీమ్‌లు పని చేస్తున్నాయి. యూత్ ఎంత? ఉపాధి కోసం వెళ్లిన వారు ఎంత మంది..? ఉద్యోగాలు చేస్తున్నావా రెవరెవరో గుర్తించి వారి ఫోన్ నంబర్లు, వివరాలు తెలుసుకునే పనిలో లీడర్లు తలము నకలై ఉన్నారు. పట్టణాల్లో ఉన్నవారి వివరాలు సేకరించి వారిని తీసుకు వచ్చే బాధ్యతలను తమ నమ్మిన బంట్లకు అప్పజెప్తున్నారు. వారందరినీ ఎలాగైన తీసుకొచ్చి ఓట్లు వేసేలా చర్యలు చేపడుతున్నారు. ఒకరి కంటే ముందు మరొకరు వారిని సంప్రదించి మాట తీసుకుంటున్నారు. పోలింగ్ రోజు గ్రామాలకు వచ్చి తమకే ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు.

ప్రయాణ ఖర్చులు భరిస్తూ..

ఒకే కుటుంబంలో ఐదారుగురు ఓటర్లు ఉంటే వారికి రాను పోను వాహనాన్ని సమ కూర్చే ఏర్పాట్లు చేస్తున్నారు. అవసరమైతే కార్ ఎంగేజ్ చేసుకోవాలని సూచిస్తున్నారు. తక్కువ మంది ఉంటే వారికి బస్సు, ట్రైన్ చార్జీలు ఇస్తామని చెబుతున్నారు. చెల్లించి, వచ్చిన తర్వాత మిగతా మొత్తాన్ని నగదు రూపకంగా చెల్లించేలా ఒప్పందం చేసుకుంటున్నారు. ప్రయాణ ఖర్చును తామే భరిస్తామని ఎలాగైనా వచ్చి ఓటేయాలని ఆశావహులు కోరుతున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

బెల్లంపల్లి, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా షీ టీం ఎస్ఐ హైమా అన్నారు. మంగళవారం బాలికల వసతిగృహంలో విద్యార్థులకు అవగాహన కల్పించి మాట్లాడారు. ఫోక్సో చట్టం లైంగిక నేరాల నుంచి చిన్నారులను రక్షణ కల్పించే చట్టం అని పేర్కొన్నారు. పిల్లలపై జరుగుతన్న అకృత్యాలను అరికట్టడం కోసం ఫోక్సోచట్టాన్ని తీసుకొచ్చారన్నారు. లైంగికవేధింపుల నుంచి రక్షణ కల్పిస్తుందని పేర్కొన్నారు. ఎవరైన ఆకతాయిలు విద్యార్థినులను వేధింపులకు గురి చేస్తే డయల్ 100కు గాని, షీటీం సభ్యులకు గాని సమాచారం అందించాలన్నారు. టీసేఫ్ యాప్ విద్యార్థులకు, మహిళల భద్రత కోసం ప్రతి ఒక్కరు డౌన్‌లోడ్ చేసుకో వచ్చునన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా షీ టీం సిబ్బంది జ్యోతి, పాల్గొన్నారు.

బానిసత్వాన్ని నిర్మూలించాలి

మంచిర్యాల క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : బానిసత్వ ఆలోచనను చంపేద్దామని, బానిసత్వాన్ని నిర్మూలించాలని టీబీఎస్ఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మోతె రాయలింగు అన్నారు. మంగళవారం అంతర్జాతీయ బానిసత్వ నిర్మూలన దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతీ మనిషికి జన్మ హక్కుగా లభించేది స్వేచ్ఛ, గౌరవం, సమానత్వం అన్నారు. బలహీన వర్గాలను రక్షించడానికి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ప్రజాప్రతినిధులు, సాధారణ పౌరులు సైతం కట్టుబడి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణచంద్, తోకల రవిలు ఉన్నారు.

ఎంజేపీ విద్యార్థులకు గోల్డ్ మెడల్స్

హాజీపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : బెల్లంపల్లిలో తెలంగాణ రెసిడెన్షియల్ పాఠశాలలో సోమవారం జరిగిన పీఎం జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్‌లో మండలంలోని గుడిపేట మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులు ఖోఖోలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఉమ్మడి జిల్లా ఆర్సీవో సేరు శ్రీధర్ విద్యార్థులను అభినం దినంచారు. ఈ కార్యక్రమంలో పీఈడీ సురేష్, పీఈటీ నాగేష్‌లు పాల్గొన్నారు.

ఓటర్లకు స్వేచ్ఛ ఏది..?

(5వ పేజీ తరువాయి)

ఖాతాలో జమ చేసే విధంగా నిబంధనలు రూపొందించింది. అయితే ఎన్నికల్లో ఆ చట్టానికి తూట్లు పొడుస్తూ కొందరు అభ్యర్థులు ఇష్టారీతిన ఖర్చు చేస్తూ ప్రజలను ప్రలోభాలకు గురి చేస్తున్నారు. చట్టం ప్రకారం పోస్టర్లు, బ్యానర్లు, జెండాలు, హోర్డింగులు, ర్యాలీలు, సభల నిర్వహణ, వాహనాలు, మైకుల వాడకం తదితర కార్యక్రమాలన్నీ నిర్దేశించిన మొత్తానికి లోబడే జరగాల్సి ఉంది. అయితే ఇందుకు భిన్నంగా ప్రచారంలో డబ్బు పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు.

నిబంధనల అమలులో చిత్తశుద్ధి కరువు...

ఎన్నికల సమయంలో సంస్కరణల పేరిట ఎన్నికల కమిషన్ ఎప్పటికప్పుడు మార్పులు తెస్తున్నట్లు చెబుతుందేగానీ వాటి అమలులో చిత్తశుద్ధి కొరవడిందని, ఎన్ని కల విశ్లేషకులు భావిస్తున్నారు. చట్టంలో లొసుగుల ఆ ధారంగా రెడ్ హ్యాండెడ్‌గా డబ్బులు పంచుతూ పట్టుబడ్డ వారిపై కేసులు నిలిచిన దాఖలాలు లేవని పేర్కొంటున్నారు. ఆర్థికపర విషయాల్లో అభ్యర్థుల తీరు మారితేగానీ ఓటుకు నోటు విధానంలో మార్పు వచ్చే అవకాశం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల సమయంలో ఓటర్లను నేరుగా కలుస్తున్న అభ్యర్థులు ఆ క్రమంలోనే వారికి ఆశచూపుతున్నారనేది విశ్లేషకుల అభిప్రాయం. భారతీయ శిక్షా స్మృతి చట్టం 1860 సెక్షన్ 171 బీ ప్రకారం ఎన్నికల నియమావళిని అతిక్రమించిన అభ్యర్థులకు గరిష్ఠంగా ఒక సంవత్సరం జైలు శిక్షతోపాటు జరిమానా విధించే అవకాశాలు ఉన్నాయి. విచారణలో చట్టాన్ని అతిక్రమించినట్లు రుజువైతే గెన్నికల్లో గెలుపొందిన అభ్యర్థి సభ్యత్వం రద్దు కావడంతోపాటు జైలు శిక్ష విధించే అవకాశాలు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు దేశ చరిత్రలోనే అటువంటి శిక్షలు అమలు కాకపోవడం విశేషం.



క్రీడలపై మహిళ ఉద్యోగుల ఆసక్తి

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఏరియాలో ఉద్యోగుల వార్షిక క్రీడల పట్ల మహిళ ఉద్యోగులు పెద్ద ఎత్తున ఆసక్తిని చూపుతున్నారు. మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన వార్షిక పోటీల్లో మహిళలు జావెలిన్‌త్రో, షార్ట్‌పుట్, లాంగ్‌జంప్ వంటి క్రీడల్లో పాల్గొన్నారు. మహిళ ఉద్యోగాలు పోటా పోటీగా క్రీడలు ఆడారు. అన్ని గనులతో పాటు వర్కుషాపు, ఏరియా స్టోర్‌ల నుంచి మహిళ ఉద్యో గులు హాజరయ్యారు. క్రీడల గౌరవ కార్యదర్శి మాస్కుల కార్తీక్ ఆధ్వర్యంలో క్రీడలు నిర్వహించారు.

జాతీయ మానసిక ఆరోగ్య సర్వే

జన్నారం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామంలో మంగళవారం మానసిక ఆరోగ్య స్థితి, జీవన శైలి సమస్యలపై ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ బీబీనగర్, నిమ్హాన్స్ బెంగుళూరు ఆధ్వర్యంలో నేషనల్ హెల్త్ సర్వే రెండులో భాగంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్యాల, రోటిగూడ, గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. ఈసందర్భంగా డాక్టర్ వామన్, ఫ్యామిలి మెడిసిన్ డాక్టర్ సాయిక్రిష్ణలు మాట్లాడుతూ మానసిక ఒత్తిడి, డిప్రెషన్, వృద్ధాప్యసమస్యలతో పాటు మద్యపానం, మహిళల ఆరోగ్యం వాటిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పీహెచ్‌సీడాక్టర్ ఉమాశ్రీ తోపాటు ఆరోగ్య సిబ్బంది ఉన్నారు

ధర్మారావుపేట సర్పంచుగా రాధ



కాసిపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ధర్మారావుపేట సర్పంచు ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠకు మంగళవారం తెరపడింది. మూడు రోజులుగా సర్పంచు ఎన్నిక ఏకగ్రీవంగా చేయాలనే నాయకుల పంతాలు, పట్టింపులు వీడీ మంగళవారం నాటికి అందరు ఏకాభిప్రాయానికి వచ్చారు. దీంతో మూడు రోజులుగా నెలకొన్న ఉత్కంఠ వీడింది. ధర్మారావుపేటలో ఎస్టీ మహిళ ఒక్కరే ఉండడం వల్ల నామినేషన్ ఎవరు వేయకపోవడంతో జుగునక రాధను సర్పంచుగా ఏకగ్రీవంగా తీర్మాణించారు. దీంతో జుగునక రాధ ధర్మారావుపేట గ్రామపంచాయతీకి మొదటి సర్పంచుగా ఎన్నికైంది. 2019లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఎస్టీ ఓటర్లు లేకపోవడంతో ఇక్కడ సర్పంచు ఎన్నికలు నిలిచిపోయాయి. కానీ ఇప్పుడు ధర్మారావుపేటకు చెందిన చింతల మనోజ్ , దేవాపూర్‌కు చెందిన జుగునక రాధను ప్రేమించి కులాంతర వివాహంచేసుకున్నాడు. దీంతో ధర్మారావుపేటకు కొత్తగా ఎస్టీ ఓటరు నమోదు అయ్యింది. సర్పంచు ఎన్నికల నిర్వహణ అనివార్యమైంది. గ్రామ పెద్దలందరు ఏకాభిప్రాయంతో జుగునక రాధను ఎంపిక చేశారు. గ్రామపంచాయతీల పునర్విభజనలో లంబడితండా నుంచి విడిపోయిన తర్వాత ధర్మారావుపేటలో ఎన్నికలు జరగడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీంతో ప్రజలందరు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేశారు.

సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన వారికి సన్మానం

జన్నారం, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో ఒకే నామినేషన్ వేసి ఏకగ్రీవంగా ఎన్నికైన కొత్తపల్లి వనిత శ్రీనివాస్‌లను మంగళవారం విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గంగాధర్ ఇరువురి దంపతులను సన్మానించారు. గ్రామంలో ఏకగ్రీవంగా ఎన్నికపట్ల హర్షనీయమన్నారు. ఈకార్యక్రమంలో గురువయ్య, రవి, లక్ష్మాచారి, లక్ష్మీనర్సయ్యలు పాల్గొన్నారు.

ఓపెన్ టెన్త్‌లో అడ్మిషన్ పొందిన డ్రాపౌట్ విద్యార్థి

దండేపల్లి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడిపల్లి పంచాయతీ పరిధిలోని సామగూడ చెందిన మెస్రం గణేష్ అనే డ్రాపౌట్ విద్యార్థి మంగళవారం దండేపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని ఓపెన్ స్కూల్‌లో టెన్త్‌లో అడ్మిషన్ పొందారు. బడి బయట ఉన్న పిల్లలు డ్రాపౌట్ విద్యార్థి సర్వేలో భాగంగా అతడిని గుర్తించి దండేపల్లి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సంగర్స్ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో బడిలో చేర్పించారు. ఓపెన్ టెన్త్‌లో గణేష్ అడ్మిషన్ కలిపించారు. సీఆర్పీ నర్సయ్య ఉన్నారు.

దమ్ము చేయడానికి కేజీవీల్స్ ఉపయోగించవద్దు

మందమర్రిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు వరి పంటలో దమ్ము చేయడానికి కేజీవీల్స్ ఉపయోగించవచ్చని ఏఈవో ముత్యం తిరుపతి తెలిపారు. మంగళవారం సండ్రోన్‌పల్లిలో రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కేజీవీల్స్ ఉపయోగించడం వల్ల భూమి పై పొర పెకులుతుందని తెలిపారు. కేజీవీల్స్‌ను ఉపయోగించ వద్దని పేర్కొన్నారు. రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలించిన అదనపు కలెక్టర్

తాండూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తాండూర్‌లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు చేయాలన్నారు. నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యం సేకరించాలన్నారు. రైతులందరు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జ్యోష్ను, సిబ్బంది ఉన్నారు



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

అదనపు కలెక్టర్ చంద్రయ్య

తాండూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల విధుల్లో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అదనపు కలెక్టర్ చంద్రయ్య సూచించారు. మండలంలోని తాండూర్, మాదారం, కిష్టంపేట గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను మంగళవారం బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని నామినేషన్‌లు దాఖలయ్యాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేపల్లెవాడలోని అంతర్ జిల్లా చెక్‌పోస్టును పరిశీలించారు. కొద్దిసేపు వాహనాల తనిఖీని పరిశీలించారు. చెక్‌పోస్టు వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వారి వెంట మండల తహసీల్దార్ జ్యోత్స్న సిబ్బంది ఉన్నారు. అచ్చలాపూర్‌లోని నామినేషన్ కేంద్రాన్ని, పోలింగ్ కేంద్రాన్ని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పరిశీలించారు. ఏసీపీ వెంట సీఐ దేవయ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

●మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలైన తాండూర్, అచ్చలాపూర్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ పరిశీలించారు. ఎన్నికలు ముగిసేంత వరకు ఎన్నికల నియమావళిని అందరు పాటించాలన్నారు. వంద శాతం పోలింగ్‌కు అందరు సహకరించాలన్నారు. ఆయన వెంట సీఐ దేవయ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఉన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణ

హాజీపూర్ : ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ భాస్కర్ అన్నారు. మొదటి దశ పంచాయతి ఎన్నికల్లో భాగంగా హాజీపూర్, లక్షెట్టిపేట్, దండేపల్లి, జన్నారం మండలాల్లో 90 గ్రామ పంచాయతీలలో ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు, అందులో భాగంగా హాజీపూర్ మండలంలోని రాపల్లి, దొనబండ సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను ప్రత్యక్షంగా సందర్శించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి శాంతిభద్రతల పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచనలు చేశారు. గుంపులు, గొడవలు, అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుం డా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీస్ సిబ్బందికి స్పష్టం చేశారు. డీసీపీ వెంట తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్ పాండే, ఎస్ఐ స్వరూప్ రాజ్, పంచాయతీ కార్యదర్శులు, పోలీస్ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.



పోలింగ్ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ భాస్కర్

కాసిపేట : ఎవరైనా ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే చట్టపరంగా కఠిన చర్యలుంటాయని మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాసిపేట, ముత్యంపల్లి, కోనూరు, దేవాపూర్ నామినేషన్ కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లడారు. సాధారణ ఎన్నికల్లో భాగంగా నామినేషన్‌ల ప్రక్రియ మంగళవారం ముగిసిందన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేలా అందరు సహకరించాలన్నారు. ఆయన వెంట దేవాపూర్ ఎస్ఐ గంగారాం, సిబ్బంది ఉన్నారు.

నామినేషన్ల స్వీకరణకు ఏర్పాట్లు పూర్తి



ఇందారంలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ నవీన్‌కుమార్

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 17న జరిగే స్థానిక ఎన్నికల కోసం బుధవారం నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. ఇందుకు గాను మండలంలోని 30 గ్రామపంచాయతీలు ఉండగా 10 క్లస్టర్లను ఏర్పాటు చేశారు. కిష్టంపేట, లంబాడిపల్లి, అంగ్రాజ్‌పల్లి, కత్తెరసాల, దుగ్నేపల్లి, సుద్దాల, పొక్కూరు, కొమ్మెర, ఆస్నాద, సోమనపల్లి పంచాయతీల కార్యాలయాల్లో నామినేషన్‌లు దాఖలు చేయనున్నారు. ఈ నెల 6 వరకు నామినేషన్‌లను స్వీకరించనున్నారు.

మందమర్రిరూరల్ : గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడత జరిగే ఎన్నికల నామినేషన్ స్వీకరణకు అధికారులకు అన్ని ఏర్పాట్లు చేశారు. మండలంలో 10 గ్రామపంచాయతీలు ఉండగా అధికారులు మూడు క్లస్టర్లను ఏర్పాటు చేశారు. అందుగులపేట, బొక్కలగుట్ట, పులి మడుగు ఒక క్లస్టర్‌గా, సారంగపల్లి, చిర్రకుంట, శంకర్‌పల్లి మరో క్లస్టర్‌గా, పొన్నారం, ఆదిల్‌పేట, వెంకటాపూర్, మామిడిగట్టు గ్రామాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. బుధవారం నుంచి మండలంలోని నామినేషన్ కేంద్రాల్లో అభ్యర్థుల నుంచి నామినేషన్‌లను స్వీకరించనున్నారు. పది గ్రామపంచాయతీల్లో 11, 484 మంది ఓటర్లు ఓటు వేయనున్నారు. ఇందులో పురుషులు 5680, మహిళలు 5805, ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. మంగళవారం సారంగపల్లి, పొన్నారం నామినేషన్ కేంద్రాలను ఎంపీడీవో రాజేశ్వర్ పరిశీలించారు. పకడ్బందీగా నామినేషన్‌ల స్వీకరణ చేపడతామని తెలిపారు.

సమావేశాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరి

జైపూర్: అభ్యర్థులు ర్యాలీలు, సమావేశాల కోసం అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జైపూర్ సీఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముదిగుంట, కాన్కూర్, ఇందారం, టేకుమట్ల గ్రామాల్లోని నామినేషన్ కేంద్రాలను స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రజలందరు సహకరించాలన్నారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థితో పాటు ఇద్దరు మద్దతు దారులకు మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేసే అభ్యర్థులు నిబంధనలు పాటించాలన్నారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఆయన వెంట జైపూర్ ఎస్ఐ శ్రీధర్ ఉన్నారు.

బహిరంగ సభను విజయవంతం చేయండి

రామకృష్ణాపూర్, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): సీపీఐ ఆధ్వర్యంలో డిసెంబర్ 26న రామకృష్ణాపూర్ పట్టణంలో నిర్వహించనున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ సీపీఐ శతజయంతి ఉత్సవాల ముగింపు సందర్భంగా బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, అదే విధంగా సింగరేణి యాజమాన్యం ఓసీపీ ప్రారంభ సమయంలో ఇచ్చిన హామీలను పాటించనియెడల పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు మద్దతు తెలుపుతూ పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఇప్పటికే రామకృష్ణాపూర్ బొందలగడ్డగా మారిందని పూర్తిగా సింగరేణి ప్రాంతమైన రామకృష్ణాపూర్ నేడు వ్యాపార వాణిజ్య సముదాయాలు కార్మికులు లేక కార్మికులకు వసతులు కరువై ఇబ్బందులు పడుతున్నారని యాజమాన్యం వెంటనే సమస్యలు పరిష్కరించాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇప్పకాయల లింగయ్య, రాష్ట్ర సమితి సభ్యులు మిట్టపల్లి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు మిట్టపల్లి పౌల్, నాయకులు వనం సత్యం, కాదండి సాంబయ్య, నక్క వెంకటస్వామి, ఎగుడ మొండి, తోకల రాజన్న, మొరళి పాల్గొన్నారు.

రామాయణంతో నైతిక విలువలు

కోటపల్లి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రామాయణం చదవడం వల్ల కానీ , వినడం వల్ల కానీ విద్యార్థుల్లో నైతిక విలువలు పెరుగుతాయని రామాయణంలోని ప్రతి పాత్ర ఆచరణీయం, అనుసరణీయమని కోటపల్లి పీఎంశ్రీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్ అన్నారు. పాఠశాలలోని పదవ తరగతి విషయంలోని ఉపవాచకంలో పొందుపర్చిన రామాయణాన్ని 20 రోజులుగా తెలుగు ఉపాధ్యాయుడు సురేందర్ విద్యార్థులకు విషద పర్చగా చివరి రోజు పాఠ్యాంశంలో భాగంగా శ్రీరాముని పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. రామ పట్టాభిషేక చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. పలువురు ఉపాధ్యాయులు రామాయణం విశిష్టత, ఇతిహాస కావ్యాల వల్ల ఒనగూరే ప్రయోజనాలు దీని ద్వారా విద్యార్థుల్లో నైతిక విలువలు, క్రమ శిక్షణ, బాధ్యత , బంధాలు తదితర అంశాలపై విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఫంక్షన్‌హాలు గోడలు ధ్వంసం

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని లక్ష్మీభవాని కాలనీలోని బైరినేని లక్ష్మీకి చెందిన ఫంక్షన్‌హాలు గోడలను ధ్వంసం చేశారని బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలువురిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. పుస్కూరి పవన్‌రావు, ప్రసన్న, సోనులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నామని తెలిపారు. విచారణ అధికారి, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ త్వరలోనే ఈ సంఘటన స్థలాన్ని పరిశీలించి పూర్తి వివరాలను సేకరిస్తారని తెలిపారు.

మందమర్రి ఏరియా చాంపియన్‌గా క్రాంతి



క్రాంతి (ఫైల్)

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి ఏరియా చాంపియన్‌గా స్థానిక కేకే 5 గనిలో జనరల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న క్రాంతి చాంపియన్‌షిప్ సాధించాడు. ఏరియా ఉద్యోగ వార్షిక క్రీడల్లో భాగంగా మంగళవారం స్థానిక సింగరేణి పాఠశాల మైదానంలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీల్లో క్రాంతి సత్తా చాటాడు. 800,500, 5, 10 కిలో మీటర్ల పరుగు పందెం పోటీల్లో ప్రథమ బహుమతి సాధించి ఏరియా చాంపియన్‌గా నిలిచాడు. జీఎం రాధాకృష్ణ, కేకే 5 గని అధికారులు క్రాంతిని అభినందించారు.

దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలి

మందమర్రిరూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు పెద్దపల్లి సత్యనారాయణ కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా బ్యాక్ ఉద్యోగాలను దివ్యాంగులతో భర్తీ చేయాలని, చట్ట సభల్లో 5 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు కో ఆప్షన్ మెంబర్ పదవి కేటాయించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ప్రత్యేకంగా 5 శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్సు రైలు సౌకర్యం కల్పించాలన్నారు. పూర్తిగా నడవలేని వారికి ప్రభుత్వం రూ. 15 వేల పింఛన్, మూడు చక్రాల వాహనాలను ఇవ్వాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల్లో వికలాంగులకు ఫీజులో వందశాతం రాయితీ కల్పించాలన్నారు.

ఘనంగా గురు చరిత్ర పారాయణం

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని అంబా అగస్త్యేశ్వర ఆలయంలో మంగళవారం గురు చరిత్ర పారాయణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి యేటా మార్గశిర మాసంలోని అష్టమి నుంచి మొదలుకుని పౌర్ణమి వరకు వారం రోజులు శ్రీ దత్తాత్రేయ స్వామి చరిత్రను పారాయణం చేస్తుంటారు. మొదటి రోజు భక్తులు మేడి చెట్టు వద్ద కోరిన కోర్కెలు తీర్చాలని ప్రత్యేక పూజలు చేశారు. మేడి చెట్టు కింద అర్చకులు వేమారపు మహేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో గురు చరిత్ర పారాయణంను ఘనంగా నిర్వహించారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలి

అదనపు కలెక్టర్ చంద్రయ్య



దివ్యాంగుల ఆటల పోటీలను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. జిల్లాస్థాయిలో గెలుపొందిన వారిని రాష్ట్ర స్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా రన్నింగ్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో పోటీలను నిర్వ హించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధి కారి రౌఫ్‌ఖాన్, జిల్లా యువజన క్రీడా అధికారి హనుమంత రెడ్డి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, దివ్యాంగుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కుటుంబ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత

డీఎంహెచ్‌వో అనిత



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అనిత

మంచిర్యాల కలెక్టరేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ నియంత్రణ ప్రతీ ఒక్కరి బాధ్యత అని డీఎంహెచ్‌వో అనిత పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహిస్తున్న వ్యాసెక్టమీ చికిత్స శిబిరాన్ని మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుషులకు కోత కుట్టు లేని కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌లు చేస్తున్నామన్నారు. ఈ శిబిరాన్ని పురుషులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆపరేషన్ తర్వాత ఎలాంటి సమస్యలు ఉండవని, అన్ని పనులను చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు అరుణశ్రీ, గోపినాథ్, భగవతి , శ్రీమన్నారాయణ, టెక్నికల్ సిబ్బంది పద్మ, కాంతారావు, దామోద్, రాజ.ఏశ్వర్, వెంకటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలి

కలెక్టర్ కుమార్ దీపక్



కిష్టంపేటలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో మూడవ విడత నామినేషన్ ప్రక్రియ సజావుగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం చెన్నూరు మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీలో నేటి నుంచి జరగనున్న నామినేషన్ ప్రక్రియకు చేసిన ఏర్పాట్లను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే నామినేషన్‌లను తీసుకోకూడదని, రిజిస్టర్‌లను సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రతి అభ్యర్థి తప్పని సరిగా నూతన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలన్నారు. ఎన్నికల గుర్తుల కేటాయింపులో జాగ్రత్తలు వహించాలని, నామినేషన్ కేంద్రాల్లో హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేయాలన్నారు. విధులు కేటాయించబడిన అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని, ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు.

●అనంతరం కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కొనసాగుతున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. చెన్నూరు పట్టణంలో చేపట్టిన పట్టణ ఆరోగ్య కేంద్రం, సమీకృత కూరగాయల మార్కెట్ నిర్మాణం, అమృత్ 2.0 పనులను మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణతో కలిసి పరిశీలించారు. అనంతరం వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో మోహన్ ఉన్నారు.

ఎలక్షన్‌లో డిపాజిట్ కోల్పోవడం అంటే...

భీమిని/కోటపల్లి డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీ ఎలక్షన్లో పోటీ చేసే అభ్యర్థులు తమ కేటగిరీని బట్టి బ్యాంకులో కొంత నగదును డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత అభ్యర్థులకు తమ డిపాజిట్ డబ్బులు తిరిగి చెల్లిస్తే అది సహజ ఓటమిగా, అదే డబ్బులు తిరిగి రాకపోతే అభ్యర్థి డిపాజిట్ కోల్పోయినట్లు భావిస్తారు. సర్పంచు స్థానానికి పోటీ చేసే జనరల్ అభ్యర్థులు రూ. 2000, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ. 1000, వార్డు సభ్యులు జనరల్ స్థానానికి రూ.500, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు రూ. 250 డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థి పోలైన ఓట్లలో ఆరోవంతు (16 శాతం) ఓట్లను పొందాలి. 16 శాతం కన్నా తక్కువగా వస్తే డిపాజిట్‌ను ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుంటుంది.

కళాకారులకు ప్రోత్సాహం అందించడానికే పోటీలు

మందమర్రిటౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కళాకారులకు కొదువ లేదని, కొన్నేళ్లుగా కళాకారులను ప్రోత్సహించేందుకు టాలెంట్ కల్చరల్ ఆర్ట్స్ అందిస్తున్న చేయూత మరువలేనిదని మందమర్రి ఎస్ఐ రాజశేఖర్ తెలిపా రు. ఈ నెల 6న మందమర్రిలోని సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించే దివంగత సీనియర్ జర్నలిస్టు మునీర్ స్మారక రాష్ట్రస్థాయి సంస్కృతిక పోటీల పోస్టర్లను పోలీస్‌స్టేషన్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ కళా

ఓటర్లకు స్వేచ్ఛ ఏది..?







- ఎన్నికల ప్రచారంలో డబ్బు ప్రవాహం
- రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్టుకు అభ్యర్థుల తూట్లు
- ఈసీ నిబంధనల అమలులో చిత్త శుద్ధి కరువు
- టీ పోల్ యాప్‌తో అవినీతికి చెక్ పడేనా..?

మంచిర్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడికి ఐదేళ్లకోసారి జరిగే సార్వత్రిక ఎన్నికల్లో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకొనే బృహత్తర అవకాశం కల్పించింది. తద్వారా సరైన నాయకుడిని ఎన్నుకొనే హక్కును ప్రజలకు రాజ్యాంగం కట్టబెట్టింది. రాజ్యాంగ బద్ధంగా యోగ్యుడైన నాయకుడిని ఎన్నుకొని సుపరిపాలనకు నాంది పలకాల్సిన జనం ప్రలోభాలకు గురవుతున్నారు. అభ్యర్థులు చూపే ఆశలకు లొంగుతూ అనేక మంది తమ ఇష్టాయిష్టాలకు భిన్నంగా ఓటు వేస్తున్నారు. ఈ క్రమంలో రాజ్యాంగం కల్పించిన హక్కు దుర్వినియోగం అవడమేగాక చట్ట సభల్లోకి అర్హతలేని వ్యక్తులు వస్తున్నారు. ఎన్నికలన గానే ధన ప్రభావం విపరీతంగా కనిపిస్తోంది. ఎన్నికల ద్వారా ఓట్లు సంపాదించాలనే క్రమంలో ప్రత్యక్షంగానో పరోక్షంగానో డబ్బు ప్రభావానికి తెరలేపుతున్నారు. నోటుకు ఓటు అనే చందంగా నేటి రాజకీయాలు తయారుకాగా అటు అభ్యర్థులు, ఇటు ఓటర్లు సైతం అందుకు తగ్గట్లుగానే వ్యవహరించడం ప్రమాదకర పరిణామం.

ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడి..

ఎన్నికల సమయంలో అభ్యర్థులు విపరీతంగా డబ్బు ఖర్చు చేయకుండా నిరోధించేందుకు రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్టు రూపొందించబడింది. 1951 రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్టు ప్రకారం ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మొత్తానికి లోబడి అభ్యర్థులు డబ్బు ఖర్చు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రస్తుత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి సర్పంచ్ అభ్యర్థి అయితే ఐదు వేల పైబడి జనాభా ఉన్న చోట రూ. 2.5 లక్షల లోపు ఖర్చు చేసే వెసులుబాటు కల్పించింది. ఐదు వేల జనాభాకు తక్కువగా ఉంటే రూ. 1.5 లక్షలు, అలాగే వార్డు సభ్యుల అభ్యర్థుల కోసం ఐదు వేల పైబడి జనాభా ఉంటే రూ. 50వేలు, అంతకు తక్కువ జనాభా ఉన్నచోట రూ. 30వేలు ఖర్చు చేయాలనే ఆదేశాలు ఉన్నాయి. అంతకు మించి ఖర్చు చేస్తే సదరు అభ్యర్థుల... తరువాయి 7లో..

ఫిర్యాదు చేయవచ్చు....

జిల్లా రిటర్నింగ్ అధికారి కుమార్ దీపక్



ఏ ఎన్నికల్లోనైనా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం చట్టరీత్యా నేరం. ఓటర్లను స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చూడవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. ఎన్నికల్లో అవి నీతి, అక్రమాలు జరుగుతున్నాయని దృష్టికి వస్తే ఎవరైనా సరే నేరుగా ఫిర్యాదు చేసే అవకాశం ఉంది. రిటర్నింగ్ అధికారులు, పోలీస్ శాఖకు ఫిర్యాదు చేయలేని వారు నేరుగా టీ పోల్ యాప్ ద్వారా సమాచారం అందిస్తే అవసరమైన చర్యలు ఉంటాయి. అలాగే ప్రతి మండల తహసీల్దార్‌కూ ఫోన్ ద్వారా సైతం ఫిర్యాదు చేయవచ్చు. కలెక్టరేట్‌లో ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేశాం. 08736-250501 నెంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఎన్నికలను సజావుగా నడిపించేందుకు అధికారులకు అన్ని అధికారాలు ఉన్నాయి.

హాస్టల్ వర్కర్లకు వేతనాలు చెల్లించాలి



డిప్యూటీ డైరెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

నస్పూర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : గిరిజన ఆశ్రమ హాస్టల్స్‌లో పని చేస్తున్న వర్కర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని గిరిజన శాఖ జిల్లా ఇన్‌చార్జి డిప్యూటీ డైరెక్టర్ రమాదేవికి మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ హాస్టల్స్‌లో పని చేస్తున్న డైలీ వైజ్, పార్టు టైం వర్కర్లకు నాలుగు నెలలుగా వేతనాలు అందడం లేదన్నారు. హాస్టల్స్ లో విద్యాధన్ సంస్థ నిర్వాహకులు హాస్టల్ ఆవరణలో న్యూట్రి గార్డెన్ పేరుతో కూరగాయాలు పెంచడానికి నేలను చదును చేయడానికి వర్కర్ల పెట్టి పనులు చేయిస్తున్నారన్నారు. గిరిజన శాఖ అనుమతులు లేని స్వచ్ఛంద సంస్థలకు పనులు ఇవ్వవద్దన్నారు. నాయకులు మౌలాలి, మహేందర్ పాల్గొన్నారు.

సర్పంచు ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలి



కాంగ్రెస్‌లో చేరిన వారికి కండువాలు కప్పుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

చెన్నూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రాబోయే సర్పంచు ఎన్నికల్లో చెన్నూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేయాలని, ఇందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు. కొమ్మెర గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచు సత్యనంద్‌గౌడ్ తన అనుచరులతో కాంగ్రెస్‌లో చేరగా మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి మంత్రి కండువాలు కప్పి ఆహ్వా నించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో చిట్ల



టీపీసీసీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో పాల్గొన్న చిట్ల సత్యనారాయణ

మంచిర్యాల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎగ్జిక్యూటివ్ మీటింగ్‌లో జిల్లాకు చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్ల సత్యనారాయణ పాల్గొన్నారు. సమావేశం సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌లను ఎక్కువ సంఖ్యలో గెలిపించడంతో పాటు పార్టీ పటిష్టత కోసం కార్యకర్తలను ఏకతాటిపైకి తేవాలని సీఎం దిశానిర్దేశం చేశారు. ఆ దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సూచించారు.

ముగిసిన రెండో విడత నామినేషన్ల పర్వం..



తాండూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

- చివరి రోజు అభ్యర్థుల నుంచి భారీ స్పందన
- సమయం ముగిసే సరికి క్యూలో ఉన్నవారికి టోకెన్లు
- అర్ధరాత్రి వరకు కొనసాగిన నామినేషన్ ప్రక్రియ
- రెండో విడతలో వరదలా దాఖలైన నామినేషన్లు

మంచిర్యాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రెండో విడత నామినేషన్ల పర్వం మంగళవారంతో ముగిసింది. రెండో విడుతలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని నెన్నెల, కాసిపేట, వేమనపల్లి, తాండూర్, భీమిని, కన్నెపల్లి మండలాల్లో ఎన్నికలు జరు గనున్నాయి. ఆయా మండలాల్లోని మొత్తం 114 గ్రామ పంచాయ తీలు, 996 వార్డు సభ్యులకు ఎన్నికలు నిర్వహించనుండగా నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. తొలి రెండు రోజుల్లో ఆయా మండలాల్లో సర్పంచ్ స్థానాలకు 301, వార్డు మెంబర్ స్థానాలకు 731 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరి రోజు నామినేషన్ల పర్వం రాత్రి వరకు కొనసాగింది. సమయం దాటినా అప్పటి వరకు క్యూలో ఉన్న సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులకు టోకెన్లు జారీ చేసిన ఎన్నికల అధికారులు అర్ధరాత్రి వరకు వారితో నా మినేషన్లు దాఖలు చేయించారు. రాత్రి 12 గంటల వరకు కూడా ఏ మండలంలో ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయో స్పష్టం కాలేదు. ఈ కార ణంగా చివరి రోజు దాఖలైన నామినేషన్ల సంఖ్య ను బుధవారం ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

నేటి నుంచి మూడో విడత ప్రారంభం...

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం నుంచి మూడో విడుత నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. మూడో విడుతలో చెన్నూర్ నియోజక వర్గంలోని చెన్నూర్, జైపూర్, భీమారం, కోటపల్లి, మందమర్రి మండలాల్లో నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఆయా మండలాల పరిధిలో 102 సర్పంచ్ స్థానాలు, 868 వార్డు సభ్యుల స్థానాలకు ఈ నెల 3న నామినేషన్లు స్వీకరణ ప్రారంభం కానుంది.

బెల్లంపల్లి: రెండో విడత నామినేషన్ల స్వీ కరణ గడువు మంగళ వారం ముగుస్తుండడంతో నామినేషన్ పత్రాలు దాఖలు చేయడానికి ఉదయం నుంచి అభ్యర్థులు క్యూకట్టారు.

మండలంలో మొత్తం 17 గ్రామ పంచా యతీలకు 156 వార్డులు ఉన్నాయి. సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు నా మినేషన్ వేసేందుకు వచ్చిన వారికి క్యూ పద్ధతిలో నిలబెట్టి టోకెన్లు అందజేశారు.

వేమనపల్లి: మండలంలోని 14 గ్రామ పంచాయతీలకు గాను మంగళవారం సర్పంచ్ స్థానాలకు 49 నామినేషన్లు నామినేషన్లు దాఖల య్యాయి. రాజారం గ్రామ పంచాయతీని ఎస్టీలకు బదులు ఎస్సీలకు రిజర్వు చేయడంతో ఇక్కడ ఒక్క నామినేషన్ కూడ దాఖలు కాలేదు. రాజారం గ్రామ పంచాయతీలో ఎస్సీ ఓటర్లు ఎవరు లేకపోవడంతో ఇక్కడ సర్పంచ్ స్థానానికి ఒక్క నామినేషన్ రాలేదు. మూడు రోజుల నుంచి మొత్తం సర్పంచ్ స్థానాలకు 84 నామినేషన్లు దాఖలయ్యాయి.

అలాగే 118 వార్డులకు మంగళవారం 202 నామినేషన్లు దాఖలు కాగా మొత్తం వార్డు స్థానాలకు 277 నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో కుమార స్వామి తెలిపారు.

కాసిపేట : మండలంలో నామినేషన్‌ల ప్రక్రియ మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. రాత్రి 9 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం ధర్మారావుపేట పంచాయతీ ఏకగ్రీవం కాగా, 21 గ్రామపం చాయ తీలకు 68 మంది సర్పంచు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేశారు. అలాగే 190 వార్డు సభ్యులకు గాను 318 మంది నామినేషన్‌లు దాఖలు చేశారు. రాత్రి వరకు నామినేషన్‌ల ప్రక్రియ కొనసాగుతుంది.

భీమిని : గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ చివరి రోజు మంగళవారం రాత్రి వరకు కొనసాగింది. చివరి రోజు కావడంతో మండలంలో 12 గ్రామ పంచాయతీల సర్పంచు అభ్యర్థులతో పాటు వార్డు సభ్యులు భారీగా తరలిరావడంతో నామినేషన్ కేంద్రాల వద్ద సందడి వాతావరణం నెలకొంది. రెండో రోజు 40 సర్పంచు, 105 వార్డు సభ్యులు నామినేషన్లు దాఖలు చేశారు. మల్లీడి నామినేషన్ కేంద్రంలో మల్లీడి, వీగాం, వెంకటాపూర్, చిన్నతిమ్మాపూర్ గ్రామాల నామినేషన్ల ప్రక్రియ ఇంకా రాత్రి వరకు కొనసాగింది. ఖర్జీభీంపూర్ 7 సర్పంచు, 18 వార్డు, అక్కలపల్లి 4 సర్పంచు, 9 వార్డు, భీమిని 5 సర్పంచు 20 వార్డు, లక్ష్మీపూర్ 9 సర్పంచు, 18 వార్డు, కేస్లాపూర్ 3 సర్పంచు, 8 వార్డు, చిన్న గుడిపేట 3 సర్పంచు, 6 వార్డులకు, బిట్టూరుపల్లి 2 సర్పంచు, 12 వా ర్డు, పెద్దపేట 7 సర్పంచు, 14 వార్డులకు నామినేషన్లు దాఖలు చేశారు. మల్లీడి గ్రామంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.

తాండూర్ : రెండో విడత చివరి రోజు నామినేషన్ల ప్రకియలో భాగంగా మంగళవారం పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. మం డలంలోని 15 సర్పంచ్ స్థానాలకు 61 నామినేషన్లు దాఖలయ్యాయి.అలాగే 144 వార్డు సభ్యుల స్థానానికి 257 నామినేషన్లు వేశారు.


నెన్నెల : గ్రామ పంచాయతీ నామినేషన్లు ఆఖరు రోజున వెల్లువె త్తాయి. ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయడంతో నామినేషన్ల ప్రక్రియ రాత్రి వరకు కొనసాగింది. సాయంత్రం 5 గంటల లోపు వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి ఆ తర్వాత కూడా క్రమ సంఖ్య ప్రకారం స్వీకరించారు. అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటంతో క్లస్టర్లలో వారి సమాచారం అప్‌లోడ్ చేయడం ఆలస్యం అయింది.

చనిపోయినా ఉన్నట్టు..

ఓటరు జాబితాలో తొలగని మృతుల పేర్లు..



1037	ఎ.సి.-పి.ఎస్.- వరుస సంఖ్య: 1 - 279 - 246
ఓటరు పేరు	:ముర్కి భీరయ్య
తండ్రి పేరు	:బుక్కయ్య
వయస్సు	:66 లింగము :M
ఇంటి నెంబర్	:2-242
ఎపిక్	KLQ2807113



గ్రామ పంచాయతీ: వెంకటాపూర్

1	ఎ.సి.-పి.ఎస్.- వరుస సంఖ్య: 3 - 167 - 303
ఓటరు పేరు	:దారిశెట్టి వెంకయ్య
తండ్రి పేరు	:సాంబయ్య
వయస్సు	:72 లింగము : M
ఇంటి నెంబర్.	:1-71
ఎపిక్	: TVS1592823

ఓటరు జాబితాలో.. నాలుగేళ్ల క్రితం మృతి చెందిన ముర్కి భీరయ్య, ఏడాది క్రితం మృతి చెందిన మాజీ సర్పంచు దారిశెట్టి వెంకయ్య పేర్లు

భీమిని, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ఓటరు జాబితాల్లో చనిపోయిన వారి పేర్లు ఉండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఓటరు జాబితా పారదర్శకంగా రూపొందించాలని, పొరపాట్లకు తావివ్వద్దని ఎన్నికల అధికారులు సమావేశాలు నిర్వహించి చెప్తున్నా క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. ఏడాది క్రితమే మరణించిన వారి పేర్లూ కూడా జాబితాలో కనిపించడం పలువురి పేర్లూ తప్పుగా నమోదు కావడం...చనిపోయిన వారి పేర్లూ జాబితాలో ఎలా ఉంటాయంటూ ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలలో నిర్వహించే సర్పించి ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేయగా...ఓటరు జాబితాలో అచ్చు తప్పులతో పాటూ మృతుల పేర్లూ ఉన్నాయి. మండలంలో 12 గ్రామ పచాయతీల్లో పలు గ్రామాల్లో ఏడాది క్రితం మృతి చెందినా కూడా వారి పేర్లను తొలగించలేదు.

మండలంలో మచ్చుకు కొన్ని...

మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచు దారిశెట్టి వెంకయ్య ఏడాది క్రితం మృతి చెందాడు, మల్లీడి దుబ్బగూడెం గ్రామానికి చెందిన కుడుక కాంత 9 నెలల క్రితం, చిన్నగుడిపేట గ్రామానికి చెందిన ముర్కి భీరయ్య తండ్రి పేరు బక్కయ్య మృతి చెంది 4 ఏళ్లకు పైగా అవుతుంది, అదే గ్రామానికి చెందిన దేవ బీరక్క, రాస బీరయ్య 5 నెలలు, కొంగోండి తిరుపతమ్మ, కాట్న రాజయ్యలు మృతి చెంది ఒక సంవత్సరం అవుతుంది. జూలై 1 2025 నాటికి జాబితా క్రమబద్ధీకరించి నట్లు అధికారులు పేర్కొంటున్నా ఎలాంటి మార్పులు కనిపించడం లేదు. రెవెన్యూ, బూత్ లెవల్ అధికారులు అధికారులు ఎన్నికలకు ముందు చర్యలు చేపట్టకపోవడంతో దొంగ ఓట్లు పోలయ్యే ప్రమాదమూ ఉంది. మండలంలో ప్రతీ గ్రామంలో ఓటరు జాబితాలో తప్పులు, మృతి చెందిన వారి పేర్లూ ఉండటం పై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతర్....

స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ఫైనల్ ఓటరు జాబితా తయారీలో అధికారులు కలెక్టర్ ఆదేశా లను బేఖాతర్ చేశారు. మండలంలో ఏ గ్రామంలో చూసినా ఓటరు లిస్టును పరిశీలించినా తప్పులు కనిపిస్తున్నాయి. నిబంధనల ప్రకారం మృతి చెందిన ఓట్లను తొలగించాల్సి ఉంది. కానీ అధికారుల నిర్లక్ష్యం వల్ల వారు మృతి చెంది ఏడాది కాలం గడుస్తున్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల మృతి చెందిన వారి పేర్లు తొలగించలేదు. ఈ విషయమై తహసీల్దార్ బికర్ణ దాస్‌ను వివరణ కోరగా ఈ మధ్యలో బూత్ లెవల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని మృతి చెందిన వారి పేర్లు తమ దృష్టికి వస్తే తొలగిస్తామన్నారు.

సైబర్ నేరగాళ్లను దూరం పెట్టండి

- 'ఫ్రాడ్ కా ఫుల్‌స్టాప్' కార్యక్రమం విజయవంతం చేయాలి
- రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా

మంచిర్యాల క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లను దూరం పెట్టాలని, సైబర్ మోసాలకు చెక్ పెట్టే దిశగా తెలంగాణ పోలీసులు నూతన ఆవిష్కరణ చేస్తుందని రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా అన్నారు. 'మీ భద్రత మీ చేతుల్లోనే ఉంది. ఆలోచించండి, చెక్ చేసుకోండి'. సురక్షితంగా ఉండాలని ఆయన అన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తత కోసం ప్రత్యేక కార్యాచరణలో రామగుండం పోలీసు కమిషనరేట్‌లో ఆయన మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లను దూరం పెట్టండి, ఫ్రాడ్‌కు ఫుల్‌స్టాప్ పెట్టండి అంటూ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పెరుగుతున్న సైబర్ నేరాల ను అరికట్టేందుకు ప్రజలలో అవగాహన పెంపుదల లక్ష్యంగా తెలంగాణ సైబర్ సెక్యురిటీ బ్యూరో (టీజీసీఎస్‌బీ) ఆధ్వర్యంలో ఫ్రాడ్ కాపుల్‌స్టాప్ పేరుతో ఆరు వారాలు రాష్ట్ర వ్యాప్త సైబర్ భద్రత ప్రచార కార్యక్రమంలో భాగంగా డీజీపీ, టీజీసీఎస్‌డీ చికాగోయల్, సీనియర్ అధికారులు, విద్యార్థులు, ఇతర ప్రముఖులు ప్రారంభించారన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కమిషనరేట్ పరిధిలో జూమ్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో పాల్గొన్నామన్నారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అ వగాహన కోసం ప్రత్యేకంగా ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించామన్నారు. ఆన్‌లైన్ ప్రతిజ్ఞ తీసుకోవడం, సంబంధిత కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ చేశామన్నారు. ఈ కార్యక్రమం సత్ఫలితమిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, సీసీఎస్ ఏసీపీ రంగారెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ ఉన్నారు.



గోడ ప్రతులను విడుదల చేస్తున్న సీపీ, పోలీసు అధికారులు